GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

T MEDIA

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 344 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | సోమవారం 23.06.2025 | పేజీలు : 3

## పీహెచ్‌సీలో ఊడి పడిన ఫ్యాన్

- శిశువుకు త్రుటిలో తప్పిన ప్రమాదం

**టీ మీడియా జూన్ 22,ఆదిలాబాద్ :**



ప్రాణాలు కాపేడే ఆసుపత్రుల్లోనే ప్రమాదం జరిగింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా ఫ్యాన్ పడిపోవడంతో ఆసుపత్రిలోని వారంతా ఉలిక్కిపడ్డారు. ఈ ఘటనలో ఓ శిశువుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో చోటు చేసుకుంది. ఒక్కసారిగా ఊడి పడిన ఫ్యాన్ : వివరాల్లోకి వెళితే, రెండు రోజుల క్రితం కొద్దుగుడా గ్రామానికి చెందిన పాయల్ అనే గర్భిణి పురిటి నొప్పులతో బజార్‌హత్నూర్ ఆస్పత్రిలో చేరింది. అక్కడ ఓ ఆడశిశువుకు జన్మనిచ్చింది. అనంతరం వైద్యుల పర్యవేక్షణలో బాలింత రెండు రోజులుగా ఆస్పత్రిలోనే ఉంది. ఆదివారం ఉదయం ఆస్పత్రిలోని ఫ్యాన్ ఉన్నట్టుండి ఊడి పడింది. ఫ్యాన్ పక్కనే పడటంతో శిశువుకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే కుటుంబసభ్యులు శిశువును చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు.

# అధికార పార్టీలో...
# అంతర్గత పోరు



- బీఆర్ఎస్ నుంచి వచ్చిన నియోజకవర్గాల్లో
- సున్నితంగా హెచ్చరించిన పీసీసీ

**టీ మీడియా, జూన్ 22,హైదరాబాద్ బ్యూరో :** తెలంగాణ కాంగ్రెస్‌లో నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు భగ్గుమంటున్నాయి. విమర్శలకు ప్రతి విమర్శలకు వేదికగా నిలుస్తున్నాయి. అధికారం చేపట్టి ఏడాదిన్నర దాటినా నియోజకవర్గాల్లో నాయకుల మధ్య ఉన్న విభేదాలను సమసిపోయేట్లు చర్యలు తీసుకోలేకపోతోంది రాష్ట్ర కాంగ్రెస్. తాజాగా మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి వ్యాఖ్యలు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌ను కుదిపేస్తున్నాయి. గోషామహల్, ఖైరతాబాద్, గజ్వేల్, గద్వాల్, ఆలంపూర్, పటాన్ చెరు, వనపర్తి లాంటి దాదాపు 30 అసెంబ్లీ నియోజక వర్గాలల్లో నాయకుల మధ్య విబేధాలు పార్టీ శ్రేణులను, కార్యకర్తలను కలవరపాటుకు గురి చేస్తున్నాయి.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటింది. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను నాయకులు జనంలోకి సమర్ధవంతంగా తీసుకెళ్లలేకపోతున్నారు. నాయకుల మధ్య సఖ్యత లేకపోవడం, మంత్రుల మధ్య ఐక్యత ఉండకపోవడం ఇలాంటి కారణాలతో ప్రభుత్వ పథకాలను గడప గడపకు తీసుకెళ్లలేక పోతున్నారన్న విమర్శలు ఉన్నాయి.

### నియోజకవర్గాల్లో...

రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లోనూ నాయకుల మధ్య విభేదాలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా తీసుకుంటే 30కిపైగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో వర్గ విభేదాలతో ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందడం లేదన్న భావన వ్యక్తమవుతోంది. సాధారణంగానే కాంగ్రెస్ పార్టీలో ప్రతి అసెంబ్లీ నియోజవర్గంలో ఎప్పుడు వర్గపోరు ఉండనే ఉంటుంది. ఇందుకు తోడు పది నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లో ఈ విభేదాలు ముదిరి పాకాన పడ్డాయి. ఇటీవల ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన దానం నాగేందర్, ఖైరతాబాద్ నుంచి పోటీ చేసి ఓడిన విజయారెడ్డిల మధ్య వర్గ విబేధాలు తారా స్థాయికి చేరాయి. గజ్వేల్ నియోజకవర్గంలో అక్కడ ఆ నియోజకవర్గ ఇంఛార్జి నరసారెడ్డిని డీసీసీ పదవి నుంచి తొలిగించాలంటూ ఆయన వ్యతిరేక వర్గం శుక్రవారం పీసీసీకి ఫిర్యాదు చేసింది.

### పీసీసీ స్పష్టం

అదేవిధంగా గద్వాల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి, సరితా తిరుపతయ్యల మధ్య బేధాభిప్రాయాలు కొనసాగుతున్నాయి. అలంపూర్ నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్, మల్లు రవిల మధ్య బేధాభిప్రాయాలు ఇటీవల కొట్టొచ్చినట్లు బయట పడ్డాయి. ఇక





తాజాగా పరకాల నియోజకవర్గ నాయకుడు కొండా మురళి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ నాయకులను అతలాకుతలం చేశాయి. ఆ జిల్లా నాయకులు అంతా సమావేశమై కొండా మురళి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. మరోవైపు మురళి వ్యాఖ్యలపై డీసీసీ అధ్యక్షుడిని, అబ్జర్వర్‌ల నుంచి నివేదికలు వచ్చిన తరువాత స్పందిస్తానని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీలో స్వేచ్ఛ ఎక్కువ అని చెబుతూనే ఎమ్మెల్యేలుగానీ, మంత్రులుగానీ, ఇతర నాయకులుకాని గీత దాటి మాట్లాడవద్దని పీసీసీ అధ్యక్షుడు సున్నితంగా హెచ్చరించారు. అయినా కూడా విమర్శలు, ప్రతి విమర్శలు ఆగడం లేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో చోటు చేసుకున్న విబేధాలు అక్కడి భద్రకాళి అమ్మవారి బోనాలను తాత్కాలికంగా వాయిదా వేయాల్సిన పరిస్థితులకు దారితీశాయి. కొండా మురళి వ్యాఖ్యలను ఖండించడంతో పాటు ఆయన వ్యాఖ్యలను తప్పుబడుతుండడంతో మంత్రి కొండా సురేఖ కొందరి అభ్యంతరాల మూలంగా ఏకంగా దేవుని కార్యక్రమాలనే వాయిదా వేస్తున్నట్లు ప్రకటించే పరిస్థితి ఏర్పడడం గమనార్హం. ఇప్పటికైనా రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సీఎం రేవంత్ రెడ్డిలు జోక్యం చేసుకుని. నాయకుల మధ్య అంతరాన్ని తొలగించకుంటే . ఆ ప్రభావం స్థానిక సంస్థలపై తీవ్రంగా ఉండే అవకాశం ఉందని పార్టీ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

# పీఎస్‌పీ నిర్మాణానికి... సింగరేణి అడుగులు

- రూ.3,000 కోట్లు, 500 మెగా వాట్ల ప్లాంట్
- మేడిపల్లిలో మూతపడిన బొగ్గు గనిలో పైలట్ ప్రాజెక్టు



**టీ మీడియా జూన్ 22, హైదరాబాద్ బ్యూరో :** వ్యాపార విస్తరణలో భాగంగా ఇప్పటికే థర్మల్, సౌర విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పిన సింగరేణి సంస్థ, తాజాగా పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ (పీఎస్‌పీ)ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పెద్దపల్లి జిల్లా రామగుండం వద్ద మూతబడిన మేడిపల్లి ఉపరితల గని (ఓపెన్‌కాస్ట్–ఓసీ)లో సుమారు రూ.3,000 కోట్లతో 500 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్‌పీని నిర్మించేందుకు నిర్ణయించింది.సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను రూపొందించే బాధ్యతను ప్రభుత్వ రంగ సంస్థ వ్యాప్కోస్‌కు అప్పగించింది. జియో టెక్నికల్, హైడ్రాలజీ అధ్యయనాలతో పాటు సివిల్ డిజైన్లు, ఉత్పత్తి సామర్థ్య అంశాలు, మెకానికల్, విద్యుత్ డిజైన్లు, పర్యావరణ, రక్షణ చర్యలపై అధ్యయనాలు చేశాక వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేస్తుంది. ప్లాంట్ నిర్మాణానికి పట్టే సమయం, వ్యయం, ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ అమ్మకాలకున్న అవకాశాలనూ అందులో వివరిస్తుంది.పీఎస్‌పీ జల విద్యుదుత్పత్తి కేంద్రం మాదిరిగానే పని చేస్తుంది. కృష్ణా నదిపై నిర్మించిన శ్రీశైలం జల విద్యుత్? కేంద్రంలో వరద నీటి ప్రవాహ ఉద్ధృతికి టర్బైన్లు తిరగడంతో కరెంటు ఉత్పత్తవుతుంది. పీఎస్‌పీలో, నది లేని ప్రాంతంలో రెండు రిజర్వాయర్లు నిర్మిస్తారు. అడుగున ఉన్న రిజర్వాయర్ నుంచి ఎత్తయిన ప్రదేశంలో ఉన్న మరో రిజర్వాయర్‌లోకి నీటిని పంపింగ్ చేసి, తర్వాత అందులో నుంచి నీటిని తిరిగి కిందికి వదలడం ద్వారా టర్బైన్లను నడిపి విద్యుదుత్పత్తి చేస్తారు. ప్రస్తుతం మేడిపల్లి ఉపరితల గనిలో 157 మీటర్ల లోతున ఏడాది పొడుగునా భారీ పరిమాణంలో వర్షపు నీరు నిల్వ ఉంటోంది.మళ్లీ రిజర్వాయర్?లోకి పంపిస్తారు : బొగ్గు గని ఉపరితలంపై 9.64 మిలియన్ క్యూబిక్ మీటర్ల పరిమాణంలో నీటి నిల్వ కోసం సుమారు 2,350 మీటర్ల పొడవు, 23 మీటర్ల లోతులో కొత్త రిజర్వాయర్‌ను నిర్మిస్తారు. గనిలో ఉన్న నీటిని ఉపరితలంపై నిర్మించే రిజర్వాయర్‌లోకి పగటిపూట తక్కువ ధరలకు లభించే సౌరవిద్యుత్ వినియోగించి మోటార్లతో ఎత్తిపోస్తారు. తర్వాత రాత్రిపూట అదే నీటిని కిందనున్న ఉపరితల గని రిజర్వాయర్‌లోకి వదులుతారు. ఈ నీరు కిందకు అధిక వేగంతో వచ్చే సమయంలో టర్బైన్లను నడిపితే విద్యుదుత్పత్తి అవుతుంది.కింద ఉన్న నీటిని పైకి ఎత్తిపోయడం(పంపింగ్), అక్కడ నిలువ చేసిన నీటిని తిరిగి కిందికి వదలడం ద్వారా విద్యుదుత్పత్తి చేస్తున్నందున దీనిని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు అని పిలుస్తున్నారు. మొత్తంగా పగటిపూట మిగులుగా ఉన్న సౌరవిద్యుత్‌ను వాడుకుని, తిరిగి రాత్రిపూట కరెంటును ఉత్పత్తి చేసి రాష్ట్రానికి తక్కువ ధరకే ఇవ్వాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యం. అప్పుడు బహిరంగ మార్కెట్‌లో అధిక ధరలకు కరెంటు కొనాల్సిన అసరమూ ఉండదు. దీంతో రాష్ట్ర డిస్కంలపై ఆర్థికభారం తగ్గుతుంది.రాబోయే 40 ఏళ్లపాటు ఆదాయం : కేంద్ర ప్రభుత్వం పీఎస్‌పీల ఏర్పాటును ప్రోత్సహిస్తోందని, మేడిపల్లిలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3000 కోట్ల వరకు ఉండొచ్చని ప్రాథమిక అంచనా వేసినట్లు సింగరేణి సీఎండీ బలరాం తెలిపారు. వ్యాప్కోస్ నివేదిక వచ్చాక నిర్మాణానికి సంబంధించిన టెండర్లు పిలుస్తామన్నారు. నిర్మాణం పూర్తయ్యాక రాబోయే 40 ఏళ్లపాటు 500 మెగావాట్ల విద్యుదుత్పత్తితో సింగరేణికి ఆదాయం వస్తుందని వివరించారు.

# ఐక్యతా పోరాటమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ విధానం

- ఆర్టీసీ పరిరక్షణ కోసం పోరాటాలకు సిద్ధం కండి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపు






**టి మీడియా,జూన్ 22,ఖమ్మం బ్యూరో :** ఆర్టీసీ కార్మికుల ఐక్యతకు వారధిగా పోరాటాల సారథిగా,కార్మిక వర్గ ఐక్యత పోరాటం నినాదమే ఎస్ డబ్ల్యూ ఎఫ్ విధానమని,కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని,ఆర్టీసీ కార్మిక వర్గానికి నష్టం కలిగించే ప్రభుత్వ యాజమాన్య విధానాలకు వ్యతిరేకంగా నికరంగా పోరాడే సంఘం ఎస్ డబ్ల్యూ ఎఫ్ మాత్రమేనని భారత కార్మిక సంఘాల కేంద్రం(సిఐటియు)తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పేర్కొన్నారు.ఆదివారం ఖమ్మంలోని నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్,యర్రా శ్రీకాంత్ ప్రాంగణం (ఐఎంఏ హాల్)లో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాలుగవ రాష్ట్ర మహాసభల రెండో రోజు పాలడుగు భాస్కర్ ప్రధాన వక్తగా గా పాల్గొన్నారుజూలై 9వ తేదీన దేశవ్యాప్తంగా కార్మికవర్గం చేస్తున్న సార్వత్రిక సమ్మెలో ఆర్టీసీ కార్మిక వర్గం సంపూర్ణంగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ఉమెన్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ పని ప్రదేశాల్లో మహిళల సౌకర్యాల గురించి మహిళా హక్కుల గురించి చర్చించాలని శ్రామిక మహిళలకు అండగా నిలవాలని మహిళలు పోరాటాలకు రావాలని పిలుపునిచ్చారు.రెండు రోజులపాటు జరిగిన స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాలుగవ మహాసభలో ఏఐఆర్ టి డబ్ల్యూ ఎఫ్ జాతీయ కార్యదర్శి అర్ముగనాయర్ ఆంధ్రప్రదేశ్ ఎస్ డబ్ల్యూ ఎఫ్ కోశాధికారి దివాకర్ సౌహార్ధ సందేశం ఇచ్చారు. ఆర్టీసీ కార్మికులపై పెంచిన పనిభారాలు తగ్గించాలని,రిటైర్ అయిన కార్మికులకు రావలసిన బకాయిలను వెంటనే చెల్లించాలని,మహిళా ఉద్యోగులకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు మెరుగుపరచాలని,మహాలక్ష్మి స్కీం నేపథ్యంలో వస్తున్న సమస్యలు పరిష్కరించాలని,ఔట్సోర్సింగ్ కాంట్రాక్ట్ విధానాలకు స్వస్తిపలికి రెగ్యులర్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలని,ప్రయాణికుల రద్దీ కనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచాలని,రిటైర్డ్ ఉద్యోగులకు ఏపీ తెలంగాణ రెండు రాష్ట్రాల్లో ప్రయాణించే విధంగా సూపర్ లగ్జరీ బస్సుల్లో ఉచిత ప్రయాణానికి బస్సు పాసులు మంజూరు చేయాలని, తదితర 12 తీర్మానాలను మహాసభలో చర్చించి పలు సవరణలతో ఏకగ్రీవంగా ఆమోదించారు. నూతన రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికతో ముగిసిన ఈ మహాసభలో రాష్ట్రంలోని వివిధ డిపోలకు చెందిన 183 మంది ప్రతినిధులు హాజరై కార్యదర్శి నివేదిక తీర్మానాలపై విస్తృతంగా చర్చల్లో పాల్గొన్నారు.భవిష్యత్తు పోరాటాలకు సంబంధించి పలు తీర్మానాలను ఆమోదించారు. మహాసభల జయప్రదం కోసం సహకరించిన ప్రతి ఒక్కరికి ఆహ్వాన సంఘం తరఫున కళ్యాణ వెంకటేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు.మహాసభల్లో తమ గళం ద్వారా పాటలతో అలరించిన ప్రజానాట్య మండలి సదానం దం బృందా నికి ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఏఐ ఆర్ టి డబ్ల్యూ ఎఫ్ ఖమ్మం జిల్లా నాయకత్వానికి ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం ప్రధాన కార్యదర్శి పిట్టల సుధాకర్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ గడ్డం లింగమూర్తి, ఆర్టీసీ శ్రామిక మహిళ కమిటీ రాష్ట్ర నాయకులు జిల్లా పద్మావతి, ఖమ్మం రీజియన్ అధ్యక్షులు గుండు మాధవ రావు, గుగ్గిళ్ళ రోశయ్య, పగిళ్లపల్లి నరసింహారావు, గడ్డం వెంకటయ్య వీ.రమేష్, బుగ్గవీటి లింగమూర్తి, భాగ్యలక్ష్మి, మల్లికాంబ,పద్మ, విజయలక్ష్మి, సరిత సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టులతో...
# చర్చలు జరిపేదే లేదు

### ఆయుధాలు వదలి లొంగిపోవాల్సిందే : అమిత్‌షా



**టీ మీడియా, జూన్ 22,రాయ్‌పూర్ :** మావోయిస్టులతో ఎలాంటి చర్చలు జరిపేదే లేదని హోంమంత్రి అమిత్? షా స్పష్టం చేశారు. ఆయుధాలు విడిచి జనజీవన స్రవంతిలో కలవాలని కోరారు. వర్షాకాలంలో కూడా నక్సల్స్? ఏరివేత కొనసాగుతుందని, మార్చి 2026లోగా నక్సల్స్?ను పూర్తిగా నిర్మూలించడమే తమ లక్ష్యం అన్నారు. ఆయుధాలు వదలిన వారిని తాము హృదయపూర్వకంగా స్వాగతిస్తామని తెలిపారు. రెండు రోజుల పర్యటన సందర్భంగా పలు కీలక పనులకు శంకుస్థాపన ఆయన ఈ మేరకు ఛత్తీస్?గఢ్?లో ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు.ఛత్తీస్‌గఢ్‌లో విష్ణు దేవ్ సాయి ప్రభుత్వం దూసుకుపోతుందని, నక్సల్స్? ఏరివేతలో అతిపెద్ద విజయం సాధించారని అమిత్ షా ప్రశంసించారు. నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌ను వేగవంతం చేయడమే కాకుండా, ఎప్పటికప్పుడు దానికి మార్గనిర్దేశం చేస్తూ వస్తుందని తెలిపారు. తాను గత పదకొండు సంవత్సరాలుగా ఛత్తీస్‌గఢ్‌కు వస్తున్నాని చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌ను అభివృద్ధి చేసిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందని వ్యాఖ్యానించారు. అంతకుముందు ఛత్తీస్‌గఢ్‌లోని నవ రాయ్‌పూర్ అటల్ నగర్‌లో మూడు నూతన కార్యక్రమాలకు అమిత్ షా ఆదివారం శంకుస్థాపన చేశారు. నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ పనులు ప్రారంభించారు. వాటితో పాటు ఎన్ఎఫ్ఎస్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్, ఛత్తీస్‌గఢ్-ఐహబ్ కూడా ప్రారంభించారు.

**రూ. 400 కోట్లతో నిర్మాణపు పనులు: డిప్యూటీ సీఎం విజయ్ శర్మ**

ఎన్?ఎఫ్?ఎస్?యూ క్యాంపస్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 40 ఎకరాల భూమిని కేటాయించిందని, దీన్ని కేంద్రం రూ. 400 కోట్లతో నిర్మిస్తుందని డిప్యూటీ సీఎం విజయ్ శర్మ తెలిపారు. 6 నుంచి 7 ఎకరాల విస్తీర్ణంలో సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. నక్సలైట్లు అమర్చిన ప్రెజర్ ఐఈడీ పేలిన ఘటనలో ప్రాణాలు కోల్పోయిన అదనపు పోలీస్ సూపరింటెండెంట్ ఆకాష్ రావ్? కుటుంబ సభ్యులను షా కలువనున్నారని తెలిపారు. 2023 అసెంబ్లీ ఎన్నికల తర్వాత బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఛత్తీస్‌గఢ్‌లో నక్సల్ వ్యతిరేక కార్యకలాపాలు ముమ్మరం చేశామన్నారు. గత ఏడాది జనవరి నుంచి 400 మందికి పైగా మావోయిస్టులను భద్రతా దళాలు మట్టుబెట్టాయన్నారు.

# అర్హులైన పేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు

- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- ఆదర్శవంతంగాఏదులాపురం మున్సిపాలిటీని

**టీ మీడియా జూన్ 22,ఖమ్మం:**



అర్హులైన పేదలకు దశల వారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని, ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.ఆదివారం మంత్రివర్యులు, ఏదులాపురం మునిసిపల్ పరిధిలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఏదులాపురం మున్సిపల్ ప్రాంతం నాయుడుపేట జంక్షన్ వద్ద 4 కోట్ల రూపాయలతో ఖమ్మం – మహబూబాబాద్ నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులకు, పెద్దతండ గ్రామంలో ఖమ్మం – సూర్యాపేట ఆర్ అండ్ బి రోడ్డు నుండి శ్రీ యోగానంద సాయి ఆశ్రమం చల్లపల్లి గార్డెన్ వరకు కోటీ 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, గుడిమల్ల వాటర్ ట్యాంక్ నుండి బోడగుట్ట డొంక వరకు కోటి 21 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూలి సంవత్సరంన్నర కాలంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమానంగా అమలు చేస్తున్నామని అన్నారు. పేదలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అభివృద్ధి చేపట్టామని అన్నారు. అర్హులైన పేదలందరికి తప్పనిసరిగా ఇందిరమ్మ ఇండ్లు అందించే బాధ్యత తాను తీసుకుంటున్నానని అన్నారు. రేషన్ కార్డు ఉన్న పేదలకు సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని అన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎస్.ఈ. యాకోబ్, ఇఇ వి. యుగంధర్, ఖమ్మం ఆర్డీఓ నరసింహారావు, ఏదులాపురం మున్సిపల్ కమీషనర్ ఏ. శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# యానిమల్ కారిడార్‌గా మణుగూరు- కొత్తగూడెం రైల్వే మార్గం

**టి మీడియా, జూన్ 22, పినపాక ప్రతినిధి :**

మణుగూరు– కొత్తగూడెం(భద్రాచలం రోడ్) రైల్వే మార్గాన్ని యానిమల్ కారిడార్‌గా గుర్తించే ప్రయత్నాలు దాదాపు కొలిక్కి వచ్చినట్లు తెలుస్తోంది. మణుగూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఇటీవల ఓ అడవిదున్న దురదృష్టవశాత్తు రైలు ప్రమాదంలో మృతి చెందింది. ఇలాంటి ప్రమాదాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సంభవించకుండా చూడాలని అటవీ శాఖ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా రైలు మార్గంలో వన్యప్రాణుల సంచారంపై సర్వే నిర్వహించి నివేదికను వైల్డ్?లైఫ్? కన్?సర్వేషన్? డిపార్ట్?మెంట్?కు సమర్పించారు. అక్కడి నుంచి రైల్వే శాఖ ఉన్నతాధికారులకు రిపోర్టు వెళ్లనుంది.అడవి జంతువుల అభివృద్ధి కోసం : భద్రాద్రి జిల్లా కొత్తగూడెం(భద్రాచలంరోడ్)– మణుగూరు రైల్వే లైన్ పొడవు 48 కిలోమీటర్లు ఉంది. ఈ మార్గంలో ప్రయాణికుల రైళ్లతో పాటు కోల్ ట్రాన్స్?పోర్ట్? ట్రైన్స్? ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇంకోపక్క కొత్తగూడెం దాటిన తర్వాత ఈ రూట్? ఎక్కువ అటవీ ప్రాంతం నుంచే వెళుతుంది. మణుగూరు, కొత్తగూడెం, భద్రాచలం, పాల్వంచ, కిన్నెరసాని డివిజన్ల పరిధిలోని లక్షల హెక్టార్లలో అడవి రైల్వే లైన్‌కు ఇరువైపులా చాలా విస్తరించి ఉంది. కొత్తగా అడవి జంతువుల అభివృద్ధి కోసం గడ్డి మైదానాలను సైతం ఇక్కడ ఏర్పాటు చేశారు.



### సోలార్‌బోర్లు, నీటితొట్లు

అడవి జంతువుల కోసం సుమారు వెయ్యి వరకు చెక్‌డ్యాంలు, సోలార్‌బోర్లు, నీటితొట్లు అమర్చారు. దీంతో మూగజీవుల సంచారం మరింత పెరిగింది. జంతువుల సంచారాన్ని గమనించేందుకు 110 సీసీ కెమెరాలను ముఖ్యమైన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. సర్వే చేసిన నెల రోజుల్లో సుమారు 52 రకాల జంతువులు, వివిధ పక్షులు ఉన్నట్లు అధికారులు కనుగొన్నారు. దాదాపుగా 200 సార్లు జంతువులు, పక్షులు సంచరించినట్లు కెమెరాలో నమోదైన దృశ్యాలను గుర్తించారు. ఆ దృశ్యాలను వన్యప్రాణుల డిపార్ట్?మెంట్?కు అందించారు.

### ఏమేం చర్యలు తీసుకోవాలి

రైల్వే శాఖ ఏదైనా మార్గాన్ని యానిమల్ కారిడార్‌గా ప్రకటిస్తే ఆ మార్గంలో వణ్యప్రాణులు లోనికి ప్రవేశించే అవకాశం లేకుండా రైల్వే ట్రాక్‌కు ఇరువైపులా ఫెన్సింగ్(కంచె) ఏర్పాటు చేస్తారు. అయినా సమస్య తీవ్రత తగ్గకుంటే సెక్యూరిటీ సిబ్బందిని నియమిస్తారు.

# పైసలిస్తే ఏ పనైనా

## కంపు నుండి కాపాడటున్న స్థానికులు

**టీ మీడియా,జూన్ 22, మహబూబాబాద్:**

మహబూబాబాద్ పట్టణంలోని 20 వార్డులో మంగళ కాలనీ వడ్డెర బజార్ లో గతంలో డ్రైనేజీ కాలువను నిర్మించడం జరిగింది కానీ ఆ డ్రైనేజీ నీరు బయటికి పోవడానికి మరొక కాలువకు అనుసంధానం చేయడం మరిచిపోయారు స్థానికులు వాడే నీరు అదే కాలువలో మరుగుతూ అందులోనే ఉండిపోతుంది ఆ నీరు పోయే దారి లేక ఆ ఏరియా దుర్వాసనతో దోమలతో చిన్నపిల్లలకు జ్వరాలతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఇబ్బంది పడుతున్నామని ప్రాంత వాసులు తెలియజేయడం జరిగింది . అయితే ఈ నీరు పోవడానికి డ్రైనేజీ తీయవలసిన స్థలాన్ని కొందరు తమ ఇష్టానుసారంగా కలుపుకొని పారిగోడలు నిర్మించుకోవడం జరిగింది డ్రైనేజీ నీరు పోవడానికి స్థలము వదిలిపెట్టవలసిందిగా గతంలో చెప్పినా కూడా వినిపించుకోకుండా గోడను నిర్మాణం చేసుకున్నారు అని చెబుతున్ననారు ఈ విషయంపై మున్సిపల్ సిబ్బంది కి ఫిర్యాదు చేసినా కూడా పట్టించుకోలేదని ప్రస్తుతం మున్సిపాలిటీ పరిస్థితి డబ్బులు ఇస్తే పట్టించుకునే అధికారి లేడనే విధముగా వ్యవస్థ ఉన్నదని స్థానికులు చర్చించుకుంటున్నారు చిన్న వర్షం పడ్డ ఆ నీరు ఎటు వెళ్లడానికి వీలు లేక వారి వారి ఇంటి ముందే నిలువ ఉంటూ చిన్న బురద కొలనులా మారుతున్న దారుణమైన పరిస్థితిలో ఉన్నామని వారు వాపోతున్నారు దీనిపై ఉన్నత అధికారులు విచారణ జరిపి వారికి డ్రైనేజీ నీరు బయటికి పోయే విధముగా చర్యలు తీసుకోవాలని ఈ మురికి కంపు నుండి తమని కాపాడాలని గతంలో కూడా ప్రజా ప్రతినిధులకు తెలియపరిచినా కూడా ఎవరు తమ బాధ పట్టించుకోలేదని ఇకనైనా మునిసిపల్ అధికారులు ఈ విషయంపై విచారణ జరిపి తమ ప్రాంతంలో డ్రైనేజీ కాలువను ఏర్పాటు చేసి తమరిని కాపాడవలసినదిగా స్థానికులు కోరుకుంటున్నారు.





## జూరాల ఎడమ కాలువకు నీటిని విడుదల

**టీ మీడియా జూన్ 22,అమరచింత:**

వనపర్తి జిల్లా అమరచింత మండలం జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ నీరు విడుదల చేయాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశానుసారం ఖరీఫ్ పంటకు నీరు అందించే విధంగా జూరాల ప్రాజెక్టు ఎడమ కాలువ కు నీటిని విడుదల చేశారు. మండల కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటే రైతు ప్రభుత్వం అని, రైతుని రాజు చేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని, రైతులు నీటిని పొదుపుగా వాడాలని నాయకులు పేర్కొన్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ జూన్ నెలలో నీటిని విడుదల చేయడం చాలా హర్షనీయమని, నీరు విడుదల కావడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. కాలువ నీరు రావడంతో రైతులు నారుమడులు వేసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్.పరమేష్ రహమతుల్లా, నల్గొండ శ్రీనివాసులు, మొగిలి గంగాధర్, తులసిరాజు యాదవ్, బంగారు భాస్కర్, గణేష్ ముదిరాజ్, అరుణ్ కుమార్, భగవాన్, దామోదర్, రాజశేఖర్ రెడ్డి, గడ్డమీద అశోక్, మనివర్ధన్ రెడ్డి, రఘు, గోపాల్ యాదవ్, రాజు ,మల్లేష్, పాషా, తదితరులు పాల్గొన్నారు.



## భీమ ఫేజ్ 1 నుండి నీటి విడుదల

**టీ మీడియా, జూన్ 21 ,మదనాపురం :**

దేవరకద్ర నియోజకవర్గం కొత్తకోట, మదనపురం మండలాల శివార్లలోని భీమా ఫేజ్ 1 పంప్ హౌస్ నుండి అధికారులతో కలసి దిగువకు నీటిని విడుదల చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే మేఘా రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే జియంఆర్ , మేఘా రెడ్డి మాట్లాడుతూ భీమా ఫేజ్ 1 పంప్ హౌస్ నుంచి దిగువకు నీటిని విడుదల చేయడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు, సకాలంలో వర్షాలు కురవడం వల్ల జూన్ నెలలోనే దిగువకు నీటిని విడుదల చేయడం జరిగిందని తెలిపారు, కాంగ్రెస్ ప్రభుత్వం లో నిర్మించిన ప్రాజెక్టుల వల్లనే నేడు ఉమ్మడి పాలమూరు జిల్లాలో రైతాంగానికి సాగునీరు, తాగునీరు అందుతుందని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు

**టీ మీడియా ,జూన్ 21 ,ఆత్మకూరు:**

మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం కౌకుంట్ల మండలం అప్పంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇండ్లు లేని అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి తీరుతామని అన్నారు, గత ప్రభుత్వం చేసిన అప్పులకు, మిత్తిలు కట్టుకుంటూనే ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామన్నారు. విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేసి, చిప్ప చేతికిచ్చిన ఇచ్చిన మాట మేరకు ఒక్కొక్కటిగా హామీలను నెరవేరుస్తున్నామన్నారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో మోసం చేసిందన్నారు, గత బిఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల, దౌర్భాగ్య ఎమ్మెల్యే పాలనలో అప్పంపల్లి గ్రామంలో ఒక డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా నిర్మించలేదని గత ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు ఈ సంవత్సరం నియోజకవర్గానికి 3500 ఇండ్లను మంజూరు చేసిందని, ఈ ఇండ్ల నిర్మాణాలు పూర్తయిన వెంటనే అదనంగా 1000 ఇండ్లు మంజూరు అవుతాయని పేర్కొన్నారు, ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కిషన్, కురుమూర్తి ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి మండల నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## పలు కార్యక్రమాలలో పాల్గొన్న జిల్లెల

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**

రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లాల చిన్నారెడ్డి వనపర్తి జిల్లాలో పాల్గొని పరామర్శించారు. పెబ్బేర్ మండలం గుమ్మడం గ్రామానికి చెందిన నరోత్తం రెడ్డి భార్య జయమ్మ, బాపురెడ్డి తల్లి విష్ణువర్ధనమ్మ, మరణించిన విషయం గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి వారి పార్థివ దేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. బాధ నుంచి త్వరగా కోలుకొని ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.పరామర్శించిన వాళ్లు గుమ్మడం కాంగ్రెస్ నాయకులు హరిబాబు రెడ్డి, వెంకట్రాంరెడ్డి, కృష్ణయ్య, రోహిన్ రెడ్డి ,రాజీవ్ రెడ్డి ,సంజీవరెడ్డి ,హరిశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.అదే విధంగా శ్రీరంగాపురం మండలం కంబలాపూర్ గ్రామానికి చెందిన అశోక్ రెడ్డి కాలుకు గాయమైన విషయం తెలుసుకున్న జిల్లెల చిన్నారెడ్డి వారి ఇంటికి వెళ్లి అశోక్ రెడ్డిని పరామర్శించారు. గాయానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అశోక్ రెడ్డికి పలు ఆరోగ్య సూచనలు చేస్తూ, పౌష్టికాహారం తీసుకోని, గాయం నుంచి త్వరగా కోలుకోవాలని సూచించారు.అనంతరం గోపాల్ పేట్ మండల కేంద్రంలో తన విద్యార్థి దశలో గురువుగా విద్యాబోధనలు నేర్పిన గురువు చింతకుంట చక్రపాణి శనివారం మరణించిన విషయం తెలుసుకున్న చిన్నారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు . చక్రపాణి సార్ లేని లోటు తీరనిది అని వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. బాధ నుంచి త్వరగా కోలుకొని ధైర్యంగా ఉండాలని వారికుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు.వనపర్తి మండలం రాజ నగరం గ్రామానికి చెందిన నారాయణ రెడ్డి గారు నిన్న మరణించిన విషయం గ్రామ కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుసుకున్న చిన్నారెడ్డి వారి కుటుంబ సభ్య లను పరామర్శించడం జరిగింది . బాధ నుంచి త్వరగా కోలుకొని ధైర్యంగా ఉండాలని వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు. పరామర్శించిన వాళ్లు కృష్ణయ్య ,మన్యం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అడిగినంత లంచం ఇవ్వలేదని 'దొంగ'ను చేసేశారు

**టీ మీడియా జూన్ 22,మరిపెడ :**

అడిగినంత లంచం ఇవ్వలేదని పంచాయతీ కార్యదర్శి ఓ వ్యక్తి పై దొంగతనం నేరారోపణ చేశాడు. దీంతో గిరిజనుడు భూక్య రమేశ్ శనివారం కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని రాంపురం గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే,బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, తన తండ్రి పేరు మీదున్న ఇంటిపేరు మార్పిడికి రమేశ్ పంచాయతీ కార్యాలయానికి వెళ్లారు. దీనికిగానూ పంచాయతీ కార్యదర్శి రూ.10 వేలు లంచం అడిగారు. దీంతో రూ.4500 నగదు రూపంలో మరో రూ.500 ఆయన భార్య ఫోన్?పేకు రమేశ్ చెల్లించారు. మిగిలిన డబ్బు ఇవ్వనందుకు ఆన్?లైన్ పాస్‌వర్డ్ దొంగిలించాడని తనపై పోలీసులకు కార్యదర్శి ఫిర్యాదు చేశారని వాపోయారు. బాధితుడిని పోలీసులు బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లారు.



### ఎంపీడీవోకు చెప్పుదువు రా


కార్యదర్శి మళ్లీ ఫోన్ చేసి "ఎంపీడీవోకు చెప్పుదువు రా!" అంటూ కుల ప్రస్తావనతో దూషించారని రమేశ్ అతనిపై పోలీసులకు పిర్యాదు చేశారు. ఈ విషయమై 'ఈటీవీ భారత్' పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా, తన పాస్‌వర్డ్ దుర్వినియోగం అయినట్లు అనుమానం ఉందని, అందుకే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



## అధ్యక్షునికి సన్మానం

**టీ మీడియా, జూన్ 22, చిన్నంబావి:**

చిన్నంబావి మండల బిజెపి పార్టీ అధ్యక్షుడిగా నియమితులైన బొగ్గు కురుమయ్యను వాల్మీకి సోదరులు ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా బొగ్గు కురుమయ్య మాట్లాడుతూ మండల కేంద్రంలోనీ వాల్మీకి సోదరులు ఒక పార్టీ ముఖ్య నాయకున్ని అన్ని పార్టీల వాళ్ళు సత్కరించడం మహాద్భుతమైన అనుభూతిని ఇచ్చిందన్నారు. బిజెపి పార్టీ తనపై నమ్మకంతో మండల స్థాయిలో ఉన్నత పదవికీ అవకాశం కల్పించిందని పార్టీ లక్ష్యాలను ప్రజలకు వివరిస్తామని,పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ, సుధాకర్ నాయుడు, సత్యనారాయణ, రాజ్ కుమార్, తిరుపాలు, వెంకటేష్ నాయుడు, మధు, గోపినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## బాల్యమిత్రుడి కూతురు వివాహానికి హాజరైన ఎమ్మెల్యే

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**

పెద్దమందడి మండలం అల్వాల గ్రామానికి చెందిన తన బాల్యమిత్రుడు పెద్ద పాష కూతురు వివాహానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హాజరయ్యారు.కొత్తకోట లోని గార్డెన్లో ఆదివారం నిర్వహించిన వివాహానికి హాజరైన ఎమ్మెల్యే వధూవరులను ఆశీర్వదించి తన మిత్రుడితో కాసేపు మాట్లాడి వివాహానికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి ఫోటోలు దిగి కాసేపు సందడి చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, పెద్దమందడి మండల మాజీ జడ్పిటిసి వెంకటస్వామి, గ్రామ నాయకులు సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలను పరామర్శ**

వనపర్తి పట్టణం 8వ వార్డు శ్రీనివాసపురంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉమ్మల్ల రాములు తల్లి గారైన ఉమ్మల్ల బాలకిష్టమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులను పరామర్శించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.తన తల్లి మరణంతో తీవ్ర మనోవేదనకు గురైన నాయకుడు ఉమ్మల్ల రాములుని ఎమ్మెల్యే ఓదార్చారు.ఇదే వార్డుకు చెందిన ఉమ్మల్ల శాంతయ్య సైతం మృతి చెందడంతో శాసనసభ్యులు వారి కుటుంబ సభ్యులను సైతం పరామర్శించారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విభూది నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం తహసీల్దారుగా మణిధర్

**టి మీడియా, జూన్ 22, పినపాక ప్రతినిధి:**

అశ్వాపురం తహసీల్దారుగా మణిధర్ ను నియమిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ తహసిల్దార్ గా పనిచేసిన రాజారావు కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. భద్రాచలం సమీకృత గిరిజన అభివృద్ధి సంస్థ లో డిప్యూటీ తహసిల్దార్ గా విధులు నిర్వహిస్తున్న మణి ధర్ కు ఎఫ్ఎసి తహసిల్దార్ గా బాధ్యతలు అప్పగించారు.





## సుభాష్ నగర్ డివిజన్ సూరారం కాలనీ రాజీవ్ గృహకల్ప

**టీ మీడియా, జూన్ 22, మేడ్చల్ :**

రాజీవ్ గృహకల్ప లో గత కొన్ని నెలలుగా డ్రైనేజీ వ్యవస్థ చాలా అస్తవ్యస్తంగా ఉండటంతో అక్కడ ప్రజలు ఇబ్బంది పడుతూ పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని తెలుసుకున్న మేడ్చల్ జిల్లా ఫిషరీస్ డి ఏఫ్ సి ఏ స్ కమిటీ చైర్మన్ మన్నే రాజు సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ స్థానిక నాయకులతో కలిసి పర్యటించి జలమండలి అధికారులు వ్యవహరిస్తున్న తీరు సరి అయినది కాదని రాజీవ్ గృహకల్ప వాసు లు ఇబ్బందులను వారి సమస్యలను పట్టించుకోకపోతే స్థానిక ప్రజలతో కలిసి జలమండలి ఆఫీసు ముట్టడిస్తామని మన్నే రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు.రానున్న రోజుల్లో అధికారులు పని తీరు మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తారా సింగ్, బద్రి, కొత్తిమీర శీను, నరసింహ, రాణి, మధు, మల్లేష్, సింహాచలం రమాదేవి, స్వరూప పాల్గొన్నారు.

## చిన్న ఆరంభమే, గొప్ప విజయాలను చేకూరుస్తాయి

- బిఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**టీ మీడియా, జూన్ 22,మేడ్చల్:**

జీడిమెట్ల డివిజన్ 132 పైపులైన్ రోడ్డులోని బీరప్ప దేవాలయం వద్ద నాగరాజు ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన "తిరుమల టెంట్ హౌజ్" ను బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చిన్న ఆరంభమే, గొప్ప విజయాలను చేకూరుస్తుందని, చిన్నగా ప్రారంభమైన ఈ వ్యాపారం అనతికాలంలోనే గణనీయంగా అభివృద్ధి చెందాలన్నారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నదీమ్ రాయ్, కాలే గణేష్, విజయ్ హరీష్, రాజు యాదవ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



## హత్యపై వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**

పెద్దమందడి మండలం గట్ల ఖానాపురంలో ఇటీవల జరిగిన రేణుక హత్య ఉదాంతానికి సంబంధించిన వివరాలను వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి తెలుసుకున్నారు. ఆదివారం గట్లకానాపురం గ్రామంలోని బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వారితో మాట్లాడారు.గతంలోనే భర్త చనిపోయిన రేణుక నేడు హత్యకు గురి కావడం వారి సంతానం ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు మొత్తం ఐదు మంది అనాథలు అయ్యారని వారిని ఆదుకోవాలని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.అందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వారికి అన్నదండగా ఉంటానని భరోసా కల్పించారు.అనంతరం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న వెల్టూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య మనవడు ఆంజనేయులు ను ఎమ్మెల్యే పరామర్శించి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటికే చికిత్స నిమిత్తం రూ. 2లక్షల 50 వేల విలువగల ఎల్ఓసి అందజేశామని ఇకపైన ఏదైనా వైద్య సేవలు అవసరమున్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి వెంకటస్వామి, తాజా మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాజీ సర్పంచ్ బాలనాగయ్య, మాజీ ఎంపిటిసి దామోదర్, మాజీ సర్పంచ్ వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

- చేసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

**టీ మీడియా, జూన్ 22, మేడ్చల్:**



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారం శ్రీ శ్రీ చిత్తారమ్మ తల్లి దేవస్థానం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ నియోజకవర్గంలో ఇటీవలే అనారోగ్య పరిస్థితులతో ఆసుపత్రిలో చికిత్స పొందిన వేముల సాయికుమార్ రెడ్డి కి 60,000/-, కర్ణాక మని కి 34,000/-, లలిత భాటి కు 44,000/-, సుభాద్రకు 60,000/-, ముత్యాపాగ కవితకు 40,000/-ల సిఎంఆర్ఆఫ్ చెక్కులు పంపిణి చేశారు.ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.సిఎంఆర్ఆఫ్ ఆర్థిక సహాయం పేదలకు కొండంత అండగా నిలుస్తుంది కాబట్టి ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో సంక్షేమ పథకాల అభివృద్ధి జరుగుతుందన్నారు..ఈ కార్యక్రమంలో సిఎంఆర్ఆఫ్ లబ్దిదారులు, నియోజకవర్గం ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాటు తదితరులు పాల్గొన్నారు..

# సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి జిల్లాకు సాగునీరు

- **సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా**

**టి మీడియా, జూన్ 22, పినపాక ప్రతినిధి:**

సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించాక , ఇతర జిల్లాలకు తరలించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారంఅశ్వాపురం మండల కేంద్రంలో ఎడెల్లి శ్రీను, రాయపూడి రాజేష్, తెల్లం వెంకటరమణ, అధ్యక్షతన జరిగిన జరిగిన మండల 20వ సభలకు సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్కే షాబీర్ పాషా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ,ప్రశ్నించే కమ్యూనిస్టుల పై నరేంద్ర మోదీ, అమిత్ షా కక్ష కట్టి బూటకపు ఎన్ కౌంటర్లు చేస్తున్నారని, దేశ సంపదను మోడీ అమిత్ షా దోచుకుంటున్నారని, మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు పలువురు మావోయిస్టుల ఎన్ కౌం టర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకపోతే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటోగా స్వీకరించి న్యాయ విచారణకు ఆదేశించాలన్నారు. ఘటనపై ప్రధాని మోడీ, కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా శత్రుదేశంపై విజయం



సాధించిన రీతిలో స్పందించడం విచారకరమని తెలిపారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్ కౌంటర్ చేయడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇది శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యగా చూడాలని అన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతమొం దిస్తామని లక్ష్యంగా పెట్టుకుని మరీ ఎన్ కౌంటర్లు చేస్తుండడం, మరోపక్క తాము శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటిస్తున్నప్పటికీ పట్టించుకోకవి ోవడం ద్వారా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్ కౌంటర్లకు పాల్పడుతున్న విషయం స్పష్టమవుతుందన్నారు. ఇది ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమని, వీటన్నింటినీ పరిగణలోకి తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందని కోరారు. సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య మాట్లాడుతూపేద ప్రజలకు ఎర్ర జెండానే భరోసా అని, పేద ప్రజలు, కష్టజీవులు, కర్షకులు, కార్మికుల పార్టీ సిపిఐ అని, సుదీర్ఘ పోరాటాలు, త్యాగాలతో నిర్మితమైన ఎర్ర జెండా పార్టీకి ఎదురులేదని, మరో వందేళ్లైనా చెక్కు చెదరకుండా అజేయంగా నిలుస్తుందని, నిరంతరం సమరశీల పోరాటాలు సాగిస్తున్న సిపిఐ ఒక ప్రాంతానికో, ఒక వర్గానికో పరిమితమైన పార్టీ కాదని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, ప్రతి పంచాయతీలో సిపిఐ ప్రాతినిధ్యం ఉండే విధంగా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నారాటి ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, సైరెడ్డి పుల్లారెడ్డి, కమటం వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మి కుమారిఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్,సిపిఐ మండల అనంతనేనీ సురేష్, అనంతనేనీ శేఖర్, మేలపుర సురేందర్ రెడ్డి, కొండపర్తి ప్రసాద్, రాయపూడి రాజేష్, ఈనపల్లి పవన్ సాయి, కమటం సురేష్, అక్కెనపల్లి నాగేంద్రబాబు, దండి నాగేష్, సర్వకృష్ణ, ఏడెల్లి కమలాకర్, చెలికాని శ్రీనివాస్, రెడ్డిబోయిన వెంకన్న, మల్లబోయిన లింగయ్య, జయమ్మ, తురక అచ్చమ్మ, బెజ్జనబోయిన నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

# సంఘం బలోపేతానికి సమయం కేటాయిద్దాం

- **శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి**

**టీ మీడియా, జూన్ 22, వనపర్తి బ్యూరో :**




ఎన్ఎస్యుఐ సంఘం బలోపేతానికి రోజు రెండు గంటల సమయం కేటాయిద్దాం. 33 జిల్లాలలో వనపర్తి ముందు ఉంచుదాం. హమ్ బదిలేంగే కార్యక్రమంలో వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అన్నారు.ఎన్ఎస్యుఐ విద్యార్థి సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరు రోజుకు 2 గంటలు కేటాయిస్తే 33 జిల్లాలలో వనపర్తి నియోజకవర్గం ముందంజలో నిలుస్తుందని ప్రతి ఒక్కరు సంఘం బలోపేతానికి నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు.ఆదివారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో ఎన్ఎస్యుఐ ఆధ్వర్యంలో నిర్వహించిన హం బదిలేంగే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు వెంకటస్వామి పలువురు రాష్ట్ర నాయకులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్ఎస్యుఐ సంగం బలోపేతానికి తాను ఎల్లవేళలా కృషి చేస్తానని, సంఘ నాయకులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తను అందుబాటులో ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు.మత తత్వ పార్టీలు చేసే విష ప్రచారాన్ని విద్యార్థి లోకం తరిమి కొట్టాలని రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో ఒక్కొక్క విద్యార్థి నాయకుడు 100 ఓట్లు వచ్చేలా ప్రయత్నించి పార్టీ బలోపేతానికి సహకరించాలని ఆయన అన్నారు.సంఘం సభ్యత్వ నమోదులో వనపర్తి నియోజకవర్గ ముందు ఉండాలన్నారు.ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి పాలనలో నేడు విద్యా వ్యవస్థ పూర్తిస్థాయిలో పటిష్టం మవుతుందన్నారు.ఇంటిగ్రేటెడ్ హబ్ నిర్మాణాలు, విద్యార్థులకు 40 శాతం మెస్ చార్జీలు పెంచడం 4వ సిటీ ని ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించడం లాంటి అనేక పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.మొదటగా ఈ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర నాయకులకు గౌరవంగా స్వాగతం పలికి ర్యాలీగా బయలుదేరి వచ్చిన విద్యార్థులందరికీ ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల చందర్, ఎన్ఎస్యుఐ సంఘం నాయకులు, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో అంగన్వాడి టీచర్ మహబూబి మృతి

- **నివాళులర్పించిన సిపిఐ(ఎం), సిఐటియు నాయకులు**

**టీ మీడియా, జూన్ 22, సింగరేణి (కారేపల్లి):**



కారేపల్లి మండలం గాదెపాడుకు చెందిన అంగన్వాడి టీచర్ సిపిఐ(ఎం) మండల కమిటీ సభ్యులు ఇస్మాయిల్ సతీమణి మహబూబీ కామేపల్లి మండలం ముచ్చర్ల స్టేజి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహబూబీ తీవ్రంగా గాయపడింది .ఆమె చికిత్స పొందుతూ శనివారం రాత్రి ఆసుపత్రిలో మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామం గాదెపాడుకు తరలించారు. మహబూబ్ విషయం తెలుసుకున్న సీపీఐ(ఎం), సిఐటియు నాయకులు మృతదేహాన్ని ఆదివారం సందర్శించి సీఐటీయు పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయు మండల కన్వీనర్ కే. నరేంద్ర అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సీఐటీయు, సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ అంగన్వాడి కార్యకర్తగా సిఐటియూ లో మహబూబి చేసిన సేవలను కొనియాడారు. భర్త ఇస్మాయిల్ సీపీఐ(ఎం) మండల కమిటీ సభ్యులుగా కొనసాగుతుండగా మహబూబి



శ్రామికులు, మహిళా ఉద్యమం కోసం అంకిత భావంగా పనిచేశారన్నారు. ఆమె మరణం పార్టీకి, ఉద్యమానికి, కుటుంబానికి తీరని లోటన్నారు. నాయకులు భర్త ఇస్మాయిల్ కు సానుభూతిని తెలిపారు. ఖమ్మం ఆస్పత్రిలో మహబూబి కి సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు, రమ్య నివాళులు అర్పించగా గాదెపాడు లో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, దుగ్గి కృష్ణ, మండల కార్యదర్శి కే. నరేంద్ర, నాయకులు కే. ఉమావతి, కేసగాని ఉపేందర్, భూక్య లక్ష్మణ్, వజ్జా రామారావు, కల్తి రామచంద్రయ్య, రేగళ్ల మంగయ్య, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయు) నాయకురాలు దుగ్గి పాపారాణి, ఎస్. నాగమణి, శ్రీలక్ష్మి, అరుణ, రాణి తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో యువ నాయకుల చేరిక

**టీ మీడియా, జూన్ 22,మేడ్చల్:**



తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఈరోజు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 డివిజన్ గాజులరామారం పరిధిలోని కైసర్ నగర్ యువకులు బి .శేఖర్, బి రాజు మిత్రబృందం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ లోకి చేరడం జరిగింది .ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు తెలంగాణ రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్ , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, బోయిని వెంకటేష్, ఎక్స్ వార్డుమెంబర్ శ్రీనివాస్ రావు, డివిజన్ అధ్యక్షులు ఎండి .లాయక్, గణేష్, బి . శివ, జాకీర్, మైనారిటీ అధ్యక్షులు షఫీ, కె .యెల్ల రెడ్డి, అజయ్, గఫ్ఫార్, ఫారీన్ ఖాన్, ఎండీ అసిఫ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

## మృతిని కుటుంబానికి అండగా గుంపెల్లగూడెం వాసులు

**టీ మీడియా, జూన్ 22, సింగరేణి (కారేపల్లి):**



గ్లోబలైజేషన్ సమాజంలో సమిష్టితత్వం సన్నగిల్లుతున్న తరుణంలో కారేపల్లి మండలం గుంపెల్లగూడెం వాసులలో మానవత్వం పరిమళిస్తోంది. గ్రామంలో ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన యువకుడు బాదావత్ వీరన్న కుటుంబానికి గ్రామ ప్రజలు, యువత, గ్రామ ఎంప్లాయిస్ ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. వీరన్న ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుని గ్రామంలో యువత విరాళాలు సేకరించి రూ. 46,500 నగదును సేకరించి అందించగా, గ్రామ ఎంప్లాయిస్ తమ వంతుగా మరో రూ. 5 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. గ్రామంలో అనారోగ్యం తో బాధపడుతున్న కాంతి కి గ్రామ ఉద్యోగ యూనియన్ తక్షణ సహాయంగా 5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. ఇటీవల మరణించిన భూక్యా బాలు కుటుంబానికి 50 కేజీల బియ్యం అందజేసి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. గ్రామంలో ఏ ఒక్కరు ఆపదలో ఉన్నా, అనారోగ్యం పాలైనా, మరే ఇబ్బందుల్లో ఉన్నా, గ్రామ ప్రజలు, ఆ ఊరి ఎంప్లాయిస్ తక్షణమే స్పందించి, తమ వంతు సహాయం అందిస్తూ ఆపదబంధులుగా నిలుస్తున్నారు. వారి దాతృత్వానికి, సేవాభావానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

## యువత భాగస్వామ్యంతో డ్రగ్స్ రహిత సమాజం

- **ఎస్సై బైరు గోపి**

**టీ మీడియా, జూన్ 22, సింగరేణి (కారేపల్లి) :**



కారేపల్లి లో పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం మాదకద్రవ్యాలపై అవగాహన నిర్వహించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని కారేపల్లి పోలీసుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి కారేపల్లి బస్టాండ్ సెంటర్ లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కారేపల్లి ఎస్ఐ బైరు గోపి మాట్లాడుతూ మాదకద్రవ్య రహిత సమాజాన్ని నిర్మించే లక్ష్యంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై ప్రతి ఒక్కరికీ సమగ్ర అవగాహన అవసరమని అన్నారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం అనేది వ్యక్తిగతంగానే కాకుండా కుటుంబం, సమాజం మరియు దేశం పైన కూడా ప్రతికూల ప్రభావాన్ని కలిగిస్తుందని అన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛను విద్యార్థులు దుర్వినియోగం చేసుకోకుండా నైతిక విలువలు అలవర్చుకొని ఉజ్వలభవిష్యత్తుకు పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు.

# రక్షించాల్సిన వారే రాంగ్ రూట్

- **కాసుల యావలో ఖాకీలు**

**టీ మీడియా, జూన్ 22,అమరావతి బ్యూరో :**




రాష్ట్రంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు తెరలేపేవారిని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారికి అడ్డుకట్ట వేయాల్సిన పోలీసులే దారి తప్పుతున్నారు. కొందరు ఇష్టానుసారం వ్యవహరిస్తూ అక్రమార్కులతో చేతులు కలిపి అడ్డంగా దోచుకుంటున్నారు. పోలీస్? స్టేషన్ పరిధినే ఇష్టారాజ్యంగా చేసుకొని దందాలు చేస్తున్నారు. ఫిర్యాదు చేసేందుకు వచ్చేవారిపై నోరుపారేసుకుంటున్నారు. ఇలాంటి ఆరోపణలు ఇటీవల పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి.సాధారణంగా పోలీసులు ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూడాలి. అందుకు భిన్నంగా కొందరు జూద శిబిరాలు, దాబాల నిర్వాహకుల నుంచి నెలవారీ వసూళ్లు తీసుకుని వారిని ప్రోత్సహిస్తున్నారు. పండగల సమయంలో ఏర్పాటు చేసే నిషేధిత ఆటలకు ఒక్కో రేటు పెట్టి రూ.లక్షల్లో దోచుకుంటున్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు, తరలింపు జరిపే వారితో కుమ్మక్కై జేబులు నింపుకొంటున్నారు. అవినీతి కార్యకలాపాలకు పోలీస్ స్టేషన్లనే అడ్డాలుగా మార్చేస్తున్నారు.శ్రీకాకుళం నగరం ఫ్రెండ్స్ కాలనీలో కొందరు జూదమాడుతున్నట్లు ఇటీవల ఓ వ్యక్తి గ్రామీణ పోలీసులకు తెలిపారు. అయినా ఎవరూ స్పందించలేదని, పోలీసులు సైతం వారితో కలిసి పోయారని, చర్యలు తీసుకోలేదని సమాచారమిచ్చిన వ్యక్తి శ్రీకాకుళం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని ఓ పోలీస్ స్టేషన్లో లిక్కర్ సీసాల పేరుతో అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఉన్నతాధికారులకు తెలిసింది. తనిఖీల్లో ఎక్కువ సీసాలు పట్టుకొని తక్కువ సంఖ్య చూపించారని ఓ వ్యక్తి అధికారులకు ఫిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. మరో స్టేషన్లో ఇటీవల జరిగిన గ్రామదేవత పండగలకు రూ.2 లక్షలు వసూలు చేసినట్లు సమాచారం.ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని ఓ అధికారి పిక్కాట ఆడుకోవడానికి కొందరి నుంచి రూ.2 లక్షలు తీసుకున్నారని ఉన్నతాధికారుల చెవిన పడింది. దీంతో పాటు ఇసుక అక్రమ రవాణాను సైతం అడ్డుకోకుండా రాత్రివేళ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదు అందింది.ఆమదాలవలస నియోజకవర్గం పరిధిలోని ఓ పోలీసు అధికారిణి స్టేషన్కు వచ్చేవారిని పరుష పదజాలంతో దూషిస్తున్నారని, ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని కొందరు బాధితులు ఉన్నతాధికారులకు ఇటీవల తెలియజేశారు.శ్రీకాకుళం నగర పరిధి ఓ స్టేషన్లో నెలకు రూ.10 వేలు పంపాల్సిందేనని ఓ పోలీసు అధికారి హుకుంజారీ చేశారని దాబాల నిర్వాహకులు చెబుతున్నారు.గతంలో అందిన ఫిర్యాదుల మేరకు శ్రీకాకుళం జిల్లా ఎస్పీ విచారణ చేపట్టి కొందరు అధికారులపై చర్యలు తీసుకున్నారు. అయినప్పటికీ మిగిలినవారిలో మార్పు రావడం లేదు. మరికొన్ని ఫిర్యాదులు విచారణ దశలోనే ఉండిపోయాయి. వాటిలో ఎక్కువగా అక్రమ వసూళ్లు, బెదిరింపులు, బూతుపురాణం, సెటిల్మెంట్లు ఉన్నట్లుగా సమాచారం.అడిగేవారు లేకనే ఆగడాలు : ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే కార్యక్రమాలు, ఇతర వ్యవహారాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఉంటుంది. అది పూర్తిస్థాయిలో అమలు కావట్లేదు. బాధితులే నేరుగా జిల్లా కేంద్రానికి వెళ్లి ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులకు తెలియని పరిస్థితి నెలకొంది. పర్యవేక్షణ లేకపోవడం, అడిగేవారు కనిపించకపోవడంతో ఆగడాలు పెచ్చుమీరుతున్నాయి.

## వైభవంగా “శ్రీ రేణుక ఎల్లమ్మ కళ్యాణ మహోత్సవం

- **ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

**టీ మీడియా, జూన్ 22, మేడ్చల్:**



జీడిమెట్ల డివిజన్ 132 వైష్ణవి ఎంక్లేవ్ కాలనీ లో శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో నిర్వహించిన అమ్మవారి కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తితో కొలిచిన భక్తులను అనుగ్రహించే దైవం రేణుక ఎల్లమ్మ తల్లి అని, అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైష్ణవి ఎంక్లేవ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు రంగు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి రాకేష్ కుమార్ మరియు ఇతర కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన దళిత సంఘాల నాయకులు

**టీ మీడియా, జూన్ 22,మేడ్చల్:**



తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. వివేక్ వెంకటస్వామి సోమాజిగూడలోని తన నివాసంలో దళిత సంఘాల నాయకులు, అభిమానులు మర్యాదపూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మంత్రివర్యులకు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. దళితుల అభ్యున్నతి, వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి చేస్తున్న కృషిని ప్రశంసించారు.మంత్రి వివేక్ వెంకటస్వామి దళితులకు న్యాయం జరిగేలా ప్రభుత్వం పని చేస్తుందని, ప్రజలకు మరింత అందుబాటులో ఉంటానని తెలిపారు. “సమాజంలో అట్టడుగు వర్గాల అభివృద్ధే నాకు ప్రాధాన్యత అని మంత్రి స్పష్టంగా చెప్పారు.

## గల్లంతయిన యువకుడు మృతదేహం లభ్యం


**టి మీడియా,జూన్ 22,చింతలపూడి:**



ఏలూరు జిల్లా చింతలపూడి మండలం చింతలపూడి నగర పంచాయతీలో చార్లెస్ నగరకు చెందిన గడ్డం శాంత కుమార్ నిన్న ఉదయం 11 గంటల సమయంలో ఇద్దరు స్నేహితులతో కలిసి మద్యం సేవించి నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు తన దగ్గర ఉన్న చేపల వల మెడకుచుట్టుకొని నీటిలో మునిగిపోయాడు సమాచారం అందుకున్న, చింతలపూడి సబ్ ఇన్స్పెక్టర్ కే సతీష్ కుమార్, వారి సిబ్బంది, మరియు అగ్నిమాపక సిబ్బంది రాత్రి 7 గంటల వరకు గాలింపు చర్యలు చేపట్టారు. మరి ఒక పక్క వర్షం రావడంతో వెళ్లిపోయి తిరిగి ఈరోజు ఉదయం 6 గంటలకు అగ్ని మాపక సిబ్బంది, కోటా కోటేశ్వరరావు, వి నాగరాజు, కే రాంబాబు, ఈ రామకృష్ణ, బి నాగరాజు గంటలకు గాలింపు చర్యలు చేపట్టగా ఉదయం ఎనిమిది గంటలకు గడ్డం శాంతకుమార్ మృతదేహం లభ్యం అయింది. మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది, బంధువులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎస్సై సతీష్ కుమార్ తో పాటు, ఏఎస్ఐ కిషోర్, హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ తదితరులు ఉన్నారు.

## షిర్డీ వెళ్లే భక్తులకు గుడ్న్యూస్

- **అందుబాటులోకి ప్రత్యేక రైళ్లు!**



**టీ మీడియా, జూన్ 22,హైదరాబాద్ బ్యూరో:**షిర్డీ సాయిబాబా దర్శనానికి వెళ్లే భక్తుల రద్దీ పెరిగిన నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికులకు సౌకర్య వంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలోనే షిర్డీకి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్టు దక్షిణ మధ్య రైల్వే శాఖ ప్రకటించింది. సికింద్రాబాద్ %–% నాగర్ సోల్ మధ్య ఈ ప్రత్యేక రైళ్లను నడిపించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఈ ప్రత్యేక రైళ్లు జులై 3 నుంచి 25 వరకు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని తెలిపింది.సికింద్రాబాద్ నుంచి నాగర్ సోల్ రైలు వెళ్లే (07007) రైలు జులై 3 నుంచి ప్రతి గురువారం రాత్రి 9.20 గంటలకు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 9.45 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని రైల్వేశాఖ పేర్కొంది. మరోవైపు నాగర్ సోల్ నుంచి సికింద్రాబాద్ వెళ్లే (07002) రైలు ప్రతి శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు నాగర్సోల్ నుంచి బయలుదేరి శనివారం ఉదయం 7.30 గంటలకు గమ్యస్థానం చేరుకుంటుందని తెలిపింది.ఈ రైలు రెండుమార్గాల్లో ప్రయాణించే ట్రైన్ మల్కాజ్గిరి, బొల్లారం, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ముదే?డ్, నాందెడ్, పూర్ణ, పర్బని, జాల్నా, ఔరంగాబాద్ స్టేషన్లలో ఆగుతుందని దక్షిణ మధ్య రల్వే శాఖ తెలిపింది. ఈ రైలులో థర్డ్ ఏసీ, సెకండ్ ఏసీ, ఫస్ట్ ఏసీ కోచ్లు అందుబాటులో ఉన్నాయని వివరించింది.

## గుట్టురట్టైన రూ. 2వేల కోట్ల

# సైబర్ మోసం..

- **తీగ లాగితే డొంక కదులుతోంది..**
- **ఏకంగా చైనాతో లింక్..!**



**టీ మీడియా, జూన్ 22,జైపూర్:**రాజస్థాన్లో 2వేల కోట్ల రూపాయల సైబర్ మోసం కలకలం రేపింది. ప్రధాన నిందితుడు కృష్ణశర్మ అరెస్ట్తో దేశవ్యాప్తంగా సైబర్ మోసం డొంక కదులుతోంది. సాంకేతిక ఆధారాలతో కృష్ణశర్మ సైబర్ గ్యాంగ్ గుట్టురట్టు చేసింది రాజస్థాన్ పోలీస్ టీమ్. రాజస్థాన్ రాజధాని జైపూర్లోని సైబర్ థానా పోలీసులు ఏడు రాష్ట్రాల్లో రూ.2 వేల కోట్లకు పైగా మోసం చేసిన ఒక పెద్ద అంతర్జాతీయ సైబర్ మోసగాడు ముఠాను బట్టబయలు చేశారు. నేపాల్, దుబాయ్లలో కూర్చున్న కింగ్పిన్ల ఆదేశాల మేరకు ఈ ముఠా భారతదేశంలో నకిలీ బ్యాంకు ఖాతాలను తెరిచి చైనా సైబర్ మోసాల ముఠాకు విక్రయించింది. అరెస్టయిన నిందితులలో నేపాల్ నివాసి లాల్ డోర్జే తమాంగ్, సుజల్ తమాంగ్, ఢిల్లీ నివాసి పవన్ జైన్, అబ్దుల్ షామా ఉన్నారు.దేశంలోనే భారీ సైబర్ మోసం కేసును రాజస్థాన్లోని శ్రీ గంగానగర్ పోలీసులు చేధించారు. రాజస్థాన్లోని కొందరు కేటుగాళ్లు దేశవ్యాప్తంగా సైబర్ మోసాలకు పాల్పడుతూ పెద్దయెత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు శ్రీగంగానగర్ పోలీసులకు సమాచారం అందింది. రహస్య సమాచారంతో రంగంలోకి దిగిన శ్రీగంగానగర్ పోలీసులు.. సైబర్ కేటుగాళ్ల గుట్టురట్టు చేశారు. ఈ క్రమంలోనే.. బికనీర్ జిల్లా నపసర్ పోలీస్స్టేషన్ పరిధిలోని ఖర్దా గ్రామంలో దాడి చేశారు.కృష్ణశర్మను అదుపులోకి తీసుకుని విచారించడంతో భారీ సైబర్ మోసం డొంక కదిలింది. కృష్ణశర్మ బ్యాంకు అకౌంట్లో 99కోట్ల 65 లక్షల రూపాయల లావాదేవీల రికార్డ్ను చూసి పోలీసులు షాక్ అయ్యారు. కృష్ణశర్మ గ్యాంగ్ దేశంలోని వేలాది మందిని మోసం చేసి వేల కోట్ల రూపాయలు కాజేసినట్లు తేల్చారు. ఈ కేసుతో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని సైబర్ మోసాలు వెలుగులోకి రాగా.. కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ, గుజరాత్, పశ్చిమబెంగాల్ లాంటి రాష్ట్రాల్లో సైబర్ రాకెట్ యాక్టివ్గా ఉన్నట్లు వెల్లడైంది.ఆయా రాష్ట్రాల్లోని సైబర్ రాకెట్ కారణంగా వేలాది మంది బాధితులుగా మారారని శ్రీ గంగానగర్ ఎస్పీ గౌరవ్యాదవ్ వెల్లడించారు. సైబర్ కేటుగాళ్లు మోసం చేసే విధానాలను గుర్తించినట్లు తెలిపారు. నకిలీ పెట్టుబడి పథకాలు, క్రిప్టో కరెన్సీ ట్రేడింగ్, ఫేక్ లక్కీ డ్రాల పేరుతో వాట్సాప్ కాల్స్, సోషల్ మీడియా, నకిలీ వెబ్సైట్ల ద్వారా ప్రజలను ఆకర్షించి.. మోసాలు చేస్తున్నారన్నట్లు తేలిందన్నారు. ఈ కేసులో కొన్ని ప్రైవేట్ బ్యాంకుల ఉద్యోగుల పాత్ర కూడా అనుమానాస్పదంగా ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నామని ఎస్పీ గౌరవ్యాదవ్ తెలిపారు. మొత్తంగా.. రాజస్థాన్లోని బికనీర్ జిల్లాలో కృష్ణశర్మ అరెస్ట్తో సైబర్ నేరస్తుల నెట్వర్క్ బట్టబయలు అవుతోంది.

విచారణలో సూత్రధారి లాల్ డోర్జే టెలిగ్రామ్, ఇంటర్నెట్ ద్వారా చైనీస్ ముఠాతో నేరుగా సంబంధం కలిగి ఉన్నారని తేలింది. దుబాయ్లో నివసిస్తున్న సుష్మ అనే మహిళతో సంప్రదింపులు జరిపారు. ఆమె చైనీస్ దుండగులకు బ్యాంకు ఖాతాలు, సిమ్ కార్డు, ఇమెయిల్ ఐడిలను అందించింది. ఈ ముఠా ఒక్కొక్క ఖాతాను 5 లక్షల రూపాయలకు విక్రయించేది. ఆన్లైన్ ట్రేడింగ్, గేమింగ్ పేరుతో ఈ ఖాతాల ద్వారా చైనా నుండి డబ్బు బదిలీ చేయడం జరిగింది.ఇందులో నిందితుడు ప్రతి లావాదేవీకి 2.5 నుండి 5 శాతం కమీషన్ తీసుకునేవాడు. ఈ మొత్తాన్ని యు ఎస్ డి టి వంటి క్రిప్టోకరెన్సీలలో తీసుకున్నారు.సుజల్ తమంగ్ పని ఖాతాదారులను పర్యవేక్షించడం, వారి మొబైల్లలో %ఖ్రాఖ% యాప్ను ఇన్స్టాల్ చేయడం. ఇది ఒక గూఢచారి యాప్, దీని ద్వారా చైనీస్ దుండగులకు ఖాతాలకు పూర్తి యాక్సెస్ లభించింది. సుజల్ మొబైల్ను ఒక హోటల్లో ఉంచి నేపాల్లోని లాల్ డోర్జేకు యాక్సెస్ను అందించేవాడు. ఢిల్లీ నివాసి పవన్ జైన్ లాల్ డోర్జేను జైపూర్కు పిలిచాడు. ఈ ముఠా సభ్యులు దేశవ్యాప్తంగా బ్యాంకు ఖాతాల కోసం వెతుకుతారు. కమిషన్ ఇస్తామని ప్రజలను ఆకర్షించి వారిని ఒప్పించి, వారి మొబైల్ ఫోన్లలో ఎ పి కెలను ఇన్స్టాల్ చేయించుకుంటారు. అన్ని లావాదేవీలు డిజిటల్, ఎన్క్రిప్టెడ్ మార్గాల ద్వారా జరిగేవి.ఈ ముఠా సైబర్ మోసానికి పాల్పడినట్లు ఉత్తరప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో ఫిర్యాదులు నమోదయ్యాయి. సమాచారం అందిన వెంటనే, ఆర్పీఎస్ అధికారి సోంచంద్ వర్మ నేతృత్వంలోని పోలీసులు ఉచ్చు బిగించి నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారిపై ఐటీ చట్టం, ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఇప్పటివరకు జరిగిన అత్యంత ప్రణాళికాబద్ధమైన అంతర్జాతీయ సైబర్ మోసాలలో ఇది ఒకటి అని, దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు చెబుతున్నారు. ఈ ముఠాతో సంబంధం ఉన్న మరికొందరు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నా%–%రు.